## డీఎస్సీ అభ్యర్థుల సర్టిఫికెట్ల వెరిఫికేషన్ పూర్తి : కలెక్టర్

సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ హనుమంతు కె.జెండగే

భువనగిరి కలెక్టరేట్, అక్టోబర్ 5 : డీఎస్సీ అభ్యర్థుల ధ్రువీకరణ పత్రాల పరిశీలన ప్రక్రియ పూర్తయిందని కలెక్టర్ హనుమంతు కె.జెండగే అన్నారు. పట్టణంలోని వెన్నెల కళాశాలలో ఏర్పాటు చేసిన డీఎస్సీ – 2024లో అర్హత సాధించిన అభ్యర్థుల ధ్రువీకరణ పత్రాల పరిశీలన తీరును శనివారం చివరి రోజు కలెక్టర్ పరిశీలించి మాట్లాడారు. ఉపాధ్యాయ నియామక ప్రక్రియకు సంబంధించి అర్హత సాధించిన అభ్యర్థుల ధ్రువీకరణ పత్రాల పరిశీలన పూర్తి చేయడం జరిగిందన్నారు. భువనగిరి జిల్లాలో 277 పోస్టులు భర్తీ చేయవలసి ఉండగా.. 1:3 నిష్పత్తిలో 672 మంది అభ్యర్థులను ఎంపిక చేసినట్లు తెలిపారు. అందులో 627 మంది అభ్యర్థులు ధ్రువీకరణ పత్రాల పరిశీలనకు వచ్చారని చెప్పారు. ఆయన వెంట సంబంధిత శాఖ అధికారులు ఉన్నారు.

## ఫ్యామిలీ డిజిటల్ కార్డు సర్వేను వేగవంతం చేయాలి

● ఆర్డీఓ అమరేందర్

మహదేవ్‌పూర్‌లో ఫ్యామిలీ డిజిటల్ కార్డు నమోదు ప్రక్రియను పరిశీలిస్తున్న ఆర్డీఓ అమరేందర్

బీబీనగర్, అక్టోబర్ 5 : ఫ్యామిలీ డిజిటల్ కార్డు నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని ఆర్డీఓ అమరేందర్ అన్నారు. పైలెట్ ప్రాజెక్టులో భాగంగా మండలంలోని మహదేవ్‌పూర్ గ్రామంలో నిర్వహిస్తున్న నమోదు ప్రక్రియను శనివారం ఆయన పరిశీలించి మాట్లాడారు. నమోదు ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని సిబ్బందికి సూచించారు. అనంతరం గ్రామంలోని పురాతన అక్కన్న, మాదన్న ఆలయాన్ని సందర్శించి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో తాసీల్దార్ శ్రీధర్, ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు దండెం ప్రభాకర్ పాల్గొన్నారు.

## గ్రామీణ ప్రజలకు స్వచ్ఛమైన నీటిని అందించాలి

● మిషన్ భగీరథ సీఈ లలిత

మంచినీటి సహాయకులకు ధ్రువపత్రాలు అందజేస్తున్న మిషన్ భగీరథ సీఈ లలిత

వలిగొండ, అక్టోబర్ 5 : గ్రామీణ ప్రజలకు స్వచ్ఛమైన మిషన్ భగీరథ మంచినీటిని అందించాలని మిషన్ భగీరథ చీఫ్ ఇంజినీర్ లలిత అన్నారు. ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం గ్రామీణ మంచినీటి సహాయకుల శిక్షణ ముగింపులో ఆమె పాల్గొని శిక్షణ పొందిన కార్మికులకు ధ్రువపత్రాలు అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికీ మంచినీటిని అందించడానికి ప్రతిఒక్కరూ బాధ్యతాయుతంగా పనిచేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జితేందర్‌రెడ్డి, డీఈఈలు ప్రశాంత్‌కుమార్, అరుణకుమారి, ఎంపీఓ కేదారేశ్వర్, ఏఈఈలు మహేశ్, శ్రీలత పాల్గొన్నారు.

## నీటి సరఫరా సహాయకులకు నైపుణ్య శిక్షణ ఉపయోగకరం

శిక్షణ పొందిన మంచినీటి సరఫరా సహాయకులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ కృష్ణయ్య, డీఈ పద్మావతి, ఎంపీడీఓ రాములునాయక్

ఆత్మకూరు(ఎం), అక్టోబర్ 5 : మిషన్ భగీరథ ద్వారా నీటిని రోజూ ప్రతి ఇంటికీ అంతరాయం లేకుండా అందించేందుకు గ్రామ మంచినీటి సహాయకులకు మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన 4రోజుల శిక్షణ శనివారం ముగిసింది. ముగింపు కార్యక్రమానికి హాజరైన మిషన్ భగీరథ ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ కృష్ణయ్య మాట్లాడుతూ మంచినీటి సహాయకుకు నైపుణ్య శిక్షణ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. అనంతరం శిక్షణ పొందిన నీటి సహాయకులకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో డీఈ పద్మావతి, ఎంపీడీఓ రాములునాయక్, ఏఈ మెహర్‌సాయి, సూపరింటెండెంట్ లోకేశ్ రెడ్డి, మిషన్ భగీరథ ఫీల్డ్ అసిస్టెంట్లు ఆడెపు భిక్షపతి పాల్గొన్నారు.

## ఉపాధి హామీ పనులను పారదర్శకంగా చేపట్టాలి

● జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి సురేశ్

● మోతీరాంతండా ఫీల్డ్ అసిస్టెంట్ సస్పెన్షన్

సామాజిక తనిఖీ ప్రజావేదికలో పాల్గొన్న జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి విజయ్

తుర్కపల్లి, అక్టోబర్ 5 : జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనులను పూర్తి పారదర్శకంగా చేపట్టాలని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి సురేశ్ అన్నారు. ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో శనివారం నిర్వహించిన 14వ విడుత సామాజిక తనిఖీ ప్రజా వేదిక కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. 2023–24 సంవత్సరానికి గాను ఉపాధి హామీ పనులకు మండలంలోని వివిధ గ్రామాలకు రూ.4,14,23,000 మంజూరయ్యాయన్నారు. అందులో కూలీలకు రూ.3,88,35,206, మెటీరియల్‌కు రూ.25,87,794 ఖర్చు చేశారని, ఉపాధి హామీ కింద 437, పంచాయతీరాజ్ కింద 32 పనులు చేపట్టారని తెలిపారు. అంతకు ముందు గ్రామాల వారీగా సామాజిక తనిఖీ బృందాలు ఆయా గ్రామాల్లో చేపట్టిన పనుల వివరాలను చదివి వినిపించారు. పలు పనులకు సంబంధించి కూలీల మార్పులు, తదితర అవకతవకలతో మోతీరాంతండా ఫీల్డ్ అసిస్టెంట్ భీమాను సస్పెండ్ చేస్తున్నట్లు సురేశ్ తెలిపారు. కార్యక్రమంలో అసిస్టెంట్ విజిలెన్స్ అఫీసర్ ఆతిథ్యవర్ధన్, అంబుడ్స్‌పర్సన్ వీరమల్లు, ఎంపీడీఓ ఝాన్సీలక్ష్మీ బాయి, ఎంపీఓ వెంకటేశ్వర్లు, ఎస్ఆర్‌పీలు స్వామి, రవి, ఏపీఓ నర్సయ్య పాల్గొన్నారు.

## కబడ్డీ పోటీల్లో భువనగిరి విద్యార్థుల విజయం

కప్పుతో జిల్లా జట్టు సభ్యులు

యాదాద్రి భువనగిరి, అక్టోబర్ 5 (నమస్తే తెలంగాణ) : సీబీఎస్ఈ క్లస్టర్ రెండు రాష్ట్రాల స్థాయిలో నిర్వహించిన కబడ్డీ పోటీల్లో భువనగిరి న్యూడైమెన్షన్ పాఠశాల విద్యార్థులు ఘన విజయం సాధించారు. ఆంధ్రప్రదేశ్‌లోని తునిలో జరిగిన అండర్–19 కబడ్డీ పోటీల్లో ద్వితీయ బహుమతి కైవసం చేసుకున్నారు. ఏపీ హోంశాఖ మంత్రి వెలగపూడి అనిత చేతులమీదుగా టీమ్ కెప్టెన్ జనగాం సుష్మాస్వరాజ్ బహుమతిని అందుకున్నారు.

రాష్ట్ర స్థాయిలో పతకాలు గెలుచుకున్న విద్యార్థులను సువాలి ఎస్టేట్ చైర్మన్ పులిమామిడి సుభాశ్‌రెడ్డి, డైరెక్టర్ పులిమామిడి సుచిత్రా సుభాశ్‌రెడ్డి, ప్రిన్సిపాల్ శ్వేతారెడ్డి అభినందించారు.

# వైభవంగా అష్టోత్తర శతఘటాభిషేకం

● సామూహిక గిరిప్రదక్షిణ

సామూహిక గిరి ప్రదక్షిణలో పాల్గొన్న ఆలయ సిబ్బంది, భక్తులు

యాదగిరిగుట్ట, అక్టోబర్ 5 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ప్రధానాలయంతో పాటు అనుబంధ పాతగుట్ట (పూర్వగిరి) ఆలయంలో శనివారం స్వాతినక్షత్ర పూజలు ఘనంగా జరిగాయి. స్వామివారి జన్మ నక్షత్రమైన స్వాతి నక్షత్రం సందర్భంగా అష్టోత్తర శతఘటాభిషేకం వైభవంగా నిర్వహించారు. ప్రధానాలయం ముఖ మండపంలో 108 కలశాలను ఏర్పాటు చేసి సప్త నదీజలాలు, మామిడి, తమలపాకులు, దర్భలు, పూలమాలలు, కొబ్బరికాయలతో అలంకరించారు. పంచామృతాలతోపాటు సుగంధ ద్రవ్యాలతో స్వామివారిని అభిషేకించారు. ఆయా దేవతల మూలమంత్ర పఠనాలతో హోమ పూజలు చేశారు. ప్రధానాలయంలో కొలువుదీరిన స్వయంభూ పంచనారసింహస్వామి, సువర్ణ ప్రతిష్ఠా అలంకారమూర్తులకు వేదమంత్రాలతో అష్టోత్తర శతఘటాభిషేక పూజలు నిర్వహించి సువర్ణ పుష్పాలతో అర్చించారు. సాయంత్రం స్వాతి జన్మనక్షత్రం సందర్భంగా స్వామివారిని దివ్య మనోహరంగా అలంకరించి ప్రత్యేక పూజలు జరిపారు. తెల్లవారుజాము నుంచే భక్తులు గిరి ప్రదక్షిణలు చేసి స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు. తెల్లవారుజామునే ఆలయాన్ని తెరిచిన అర్చకులు సుప్రభాతంతో స్వామివారిని మేల్కొలిపారు. అనంతరం తిరువారాధన జరిపి, ఉదయం ఆరగింపు చేపట్టారు. స్వయంభూ ప్రధానాలయంలో స్వామి, అమ్మవార్లకు నిజాభిషేకం జరిపారు. నిజరూప దర్శనంలో స్వయంభూ నారసింహస్వామి భక్తులకు దర్శనమిచ్చారు. స్వామివారికి తులసీ సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, ఆంజనేయస్వామికి సహస్రనామార్చన చేపట్టి భక్తులకు స్వామి, అమ్మవార్ల దర్శన భాగ్యం కల్పించారు. వెలుపలి ప్రాకార మండపంలో సుదర్శన నారసింహ హోమం జరిపిన అర్చకులు ఉత్సవమూర్తులను దివ్య మనోహరంగా అలంకరించి కల్యాణోత్సవ సేవను జరిపారు. సాయంత్రం స్వామివారిని గరుఢ వాహనంపై, అమ్మవారిని తిరుచ్చి సేవపై వేంచేపు చేసి జోడు సేవను తిరువీధుల్లో ఊరేగించారు. ప్రధానాలయం ముఖ మండపంలో దర్బార్ సేవలో భాగంగా సువర్ణమూర్తులకు ప్రత్యేక పూజలు జరిపి, నక్షత్ర హారతినిచ్చారు. స్వామివారి ఖజానాకు రూ.27,79,959 ఆదాయం సమకూరిందని ఆలయ అనువంశిక ధర్మకర్త బి.నరసింహమూర్తి, ఈఓ భాస్కర్‌రావు తెలిపారు.

### సామూహిక గిరిప్రదక్షిణ

స్వామివారి జన్మనక్షత్రం స్వాతి నక్షత్రంలో భాగంగా దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహించే సామూహిక గిరిప్రదక్షిణలో భక్తులు పాల్గొన్నారు. ఉదయం 6:05 గంటలకు స్వామివారి వైకుంఠ ద్వారం వద్ద గిరి ప్రదక్షిణను అనువంశిక ధర్మకర్త బి.నరసింహమూర్తి, ఈఓ భాస్కర్‌రావు ప్రారంభించారు. కొండ చుట్టూ పాదయాత్ర నిర్వహించారు. అనంతరం కొండపైకి వెళ్లి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపారు.

## కేంద్ర మాజీ మంత్రి వెంకటస్వామికి నివాళి

భువనగిరి కలెక్టరేట్ : కలెక్టర్ కార్యాలయంలో కేంద్ర మాజీ మంత్రి వెంకటస్వామి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అదనపు కలెక్టర్లు గంగాధర్, బెన్‌షాలోమ్, జిల్లా అధికారులు

భువనగిరి కలెక్టరేట్, అక్టోబర్ 5 : కేంద్ర మాజీ మంత్రి గడ్డం వెంకటస్వామి (కాకా) 95వ జయంతిని శనివారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్లు గంగాధర్, పి.బెన్‌షాలోమ్ కాకా చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి జైపాల్‌రెడ్డి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ శ్యామ్‌సుందర్, జిల్లా పంచాయతీ అధికారి సునంద, కలెక్టరేట్ కార్యాలయ పరిపాలనా అధికారి జగన్మోహన్‌ప్రసాద్, అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఆత్మకూరు(ఎం) : మండల పరిషత్ కార్యాలయంలో వెంకటస్వామి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కార్యాలయ సూపరింటెండెంట్ లోకేశ్వర్‌రెడ్డి, ఏపీఎం కిరణ్, సీనియర్ అసిస్టెంట్ సురేందర్‌రెడ్డి, ప్రదీప్, నరేశ్, సోమయ్య, అక్బర్ పాల్గొన్నారు.

బొమ్మలరామారం : ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ రాజా త్రివిక్రమ్ ఆధ్వర్యంలో కాకా జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో కార్యాలయ పర్యవేక్షకులు జ్ఞానప్రకాశ్‌రెడ్డి, ఈజీఎస్ సిబ్బంది, కంప్యూటర్ ఆపరేటర్లు పాల్గొన్నారు.

## ఆరోగ్య పరిరక్షణ చర్యలు చేపట్టాలి : ప్రొఫెసర్ నీలిమ

ప్యారారంలో వైద్య సేవలు అందించడానికి వచ్చిన ఉస్మానియా మెడికల్ కాలేజీ విద్యార్థులు

బొమ్మలరామారం, అక్టోబర్ 5 : గ్రామంలోని ప్రతిఒక్కరూ ఆరోగ్య పరిరక్షణ చర్యలు చేపట్టాలని ఉస్మానియా మెడికల్ కాలేజీ ప్రొఫెసర్ నీలిమ అన్నారు. మండలంలోని ప్యారారం గ్రామాన్ని ఉస్మానియా మెడికల్ కాలేజీ వారు వైద్యం కోసం దత్తత గ్రామంగా ఎంచుకున్నారు. ఈ క్రమంలో శనివారం ప్రొఫెసర్ నీలిమ ఆధ్వర్యంలో మెడికల్ కాలేజీ విద్యార్థులు ఇంటింటి సర్వే చేసి గ్రామస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉస్మానియా మెడికల్ కాలేజీ విద్యార్థులు వైద్య కోర్సులో భాగంగా పార్యారం గ్రామంలో మూడేండ్లపాటు ప్రతి నెలా రెండు, నాలుగో శనివారం క్యాంప్ ఏర్పాటు చేసి వైద్య సేవలు అందిస్తారని తెలిపారు. గ్రామస్తులు ఉచిత వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఉస్మానియా మెడికల్ కాలేజీ విద్యార్థులు తమ గ్రామాన్ని దత్తతగా ఎంచుకున్నందుకు మాజీ ఎంపీపీ చిమ్ముల సుధీర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ రవీందర్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రొఫెసర్లు పావని, మనీజా, రితిక, శ్రీనివాస్, వైద్య విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటు నమోదు

ఎమ్మెల్సీ ఓటు నమోదులో మాట్లాడుతున్న యాదయ్య

భువనగిరి అర్బన్, అక్టోబర్ 5 : పట్టణంలోని బాలుర, బాలికల కళాశాలల్లో నల్లగొండ – వరంగల్ – ఖమ్మం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటరు నమోదు కార్యక్రమాన్ని టీఎస్ యూటీఎఫ్ ఆధ్వర్యంలో శనివారం చేపట్టారు. ఈ సందర్భంగా టీఎస్‌యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ముక్కర్ల యాదయ్య మాట్లాడుతూ అర్హులైన ఉపాధ్యాయులు, అధ్యాపకులు ఓటరుగా నమోదు చేసుకోవాలన్నారు. ప్రభుత్వ విద్యారంగం పటిష్టతపై రాజీలేని పోరాటం చేసే అభ్యర్థులను ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎన్నుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ నాయకులు గుజ్జ బాలయ్య, డి.కుమారస్వామి, కె.వెంకన్న, ఎస్.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## 'వడ్డెర మఠం అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేయాలి'

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వడ్డెర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఐలమల్లు

ఆలేరు రూరల్, అక్టోబర్ 5 : మండలంలోని కొలనుపాక వడ్డెర మఠం అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేయాలని వడ్డెర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శివరాత్రి ఐలమల్లు అన్నారు. మండలంలోని కొలనుపాకలో శనివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కొలనుపాకలో 22 మఠాలు ఉండగా, అందులో 21మఠాలు అభివృద్ధి చెందాయని, వడ్డెర మఠం శిథిలావ్యవస్థలో ఉన్నదని అన్నారు. వడ్డెర మఠం అభివృద్ధికి రాష్ట్రంలోని వడ్డెర కులస్తులు కూడా సహకరించాలని కోరారు. కార్యక్రమంలో వడ్డెర సంఘం నాయకులు పీట్ల మల్లేశ్, గణేశ్, దేవరాజ్, వెంకటయ్య, రాజు, సురేశ్, మహేశ్, వల్లెపు నర్సింహులు, ఓర్సు నర్సింహులు, వల్లెపు వెంకటేశ్ పాల్గొన్నారు.

## కేజీబీవీలో పోస్టుల భర్తీకి దరఖాస్తులు

భూదాన్ పోచంపల్లి, అక్టోబర్ 5 : మున్సిపాలిటీలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో అటెండర్, నైట్ వాచ్‌ఉమెన్, తెలంగాణ మోడల్ స్కూల్‌లో కేర్‌టేకర్ పోస్టులకు ఔట్‌సోర్సింగ్ ప్రాతిపదికన భర్తీ చేయుటకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంఈఓ పి.ప్రభాకర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అటెండర్, రాత్రి కాపలాదారు పోస్టులకు 18నుంచి 45ఏండ్లలోపు మహిళలు పదో తరగతి ఉత్తీర్ణులై ఉండాలని, కేర్‌టేకర్ పోస్టుకు డిగ్రీ, బీఈఈడీ, డీఈఈడీ చదివినవారు అర్హులని పేర్కొన్నారు. అర్హులు ధ్రువపత్రాలను జత పరిచి కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్‌కు ఈ నెల 8న సాయంత్రం ఐదు గంటల్లోపు దరఖాస్తులు అందజేయాలని సూచించారు. పోచంపల్లి మండలానికి చెందిన స్థానికులకు ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు.

## ఆదర్శ పాఠశాలలో కుక్ పోస్టులకు దరఖాస్తులు

చౌటుప్పల్, అక్టోబర్ 5 : చౌటుప్పల్ తెలంగాణ ఆదర్శ పాఠశాల బాలికల వసతి గృహంలో ఔట్‌సోర్సింగ్ ఖాళీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు స్వీకరించనున్నట్లు ఎంఈఓ ఇ.గురువారావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఒక హెడ్ కుక్, రెండు అసిస్టెంట్ కుక్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని, 18 సంవత్సరాలు నిండిన మహిళలు అర్హులని తెలిపారు. హెడ్ కుక్ పదో తరగతి ఉత్తీర్ణత, అసిస్టెంట్ కుక్‌లకు 7వ తరగతి ఉండాలని పేర్కొన్నారు. ఈ నెల 6నుంచి 8వరకు సాయంత్రం 5గంటల వరకు స్థానిక కేజీబీవీలో ఎస్ఓకు దరఖాస్తులు అందజేయాలని సూచించారు.

## వంట సహాయకురాలి పోస్టుకు దరఖాస్తు చేసుకోవాలి

మోత్కూరు, అక్టోబర్ 5 : మున్సిపాలిటీలోని కేజీబీవీలో వంట సహాయకురాలి పోస్టు ఖాళీగా ఉన్నదని, అర్హులైనవారు దరఖాస్తు చేసుకోవాలని ఎంఈఓ టి.గోపాల్ రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 18నుంచి 45ఏండ్ల లోపు మున్సిపాలిటీ, మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన మహిళలకు ప్రాధాన్యత ఉంటుందని పేర్కొన్నారు. దరఖాస్తులను ఈ నెల 8న సాయంత్రం 5గంటల వరకు కేజీబీఓలో అందజేయాలని సూచించారు.

## కేజీబీవీలో డే వాచ్‌ఉమెన్ పోస్టుకు దరఖాస్తులు

గుండాల, అక్టోబర్ 5 : మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో ఖాళీగా ఉన్న డే వాచ్ ఉమెన్ పోస్టుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఎంఈఓ మన్నె అగ్గిరాములు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 18–45 సంవత్సరాల వయస్సు కలిగి, పదో తరగతి విద్యార్హత కలిగి ఉండాలని, ప్రముఖ సెక్యూరిటీ ఏజెన్సీలో శిక్షణ కలిగిన మహిళలకు ప్రాధాన్యత ఉంటుందని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్నవారు అక్టోబర్ 8న సాయంత్రం 5గంటల్లోగా ఆఫ్‌లైన్ పద్ధతిలో కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో దరఖాస్తు అందజేయాలని సూచించారు.

## నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

చౌటుప్పల్, అక్టోబర్ 5 : మండలంలోని డి.నాగారం సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల కారణంగా ఆదివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ట్రాన్స్‌కో ఏఈ రాజుల సతీశ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. డి.నాగారం, పీపల్ పహాడ్, ఎనగండితండా, అల్లాపురం తదితర గ్రామాల్లో ఉదయం 9నుంచి 12గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

## తండాల అభివృద్ధికి కృషి : ఎమ్మెల్యే కుంభం

బీబీనగర్ : రామునిగుండ్ల తండా వద్ద రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డి

బీబీనగర్, అక్టోబర్ 5 : గిరిజన తండాలను అన్ని విధాలుగా అభివృద్ధి చేసుకుంటున్నామని భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి అన్నారు. మండలంలోని వివిధ గ్రామాల్లో ట్రైబల్ వెల్ఫేర్ నిధులు రూ.9.80 కోట్లతో చేపట్టనున్న బీటీ రోడ్ల నిర్మాణానికి శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గొల్లగూడెం – అనాజీపురం బీటీ రోడ్డుకు రూ.2.10 కోట్లు, సూరెపల్లి – చందుగాని తండా బీటీ రోడ్డుకు రూ.3.15 కోట్లు, ముగ్దుంపల్లి – రామునిగుండ్ల తండా రోడ్డుకు రూ.2.45 కోట్లు, చిన్నరావులపల్లి – సీనాతండా రోడ్డు నిర్మాణానికి రూ.2.10 కోట్లు మంజూరయ్యాయన్నారు. మూసీని ప్రక్షాళన చేసి మంచినీరు అందించేందుకు ప్రభుత్వం కృషి చేసుందని చెప్పారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు పంజాల రామాంజనేయులు గౌడ్, గోలి పింగళ్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ మెట్టు శ్రీనివాస్‌రెడ్డి, మండల్యాక్షుడు సురకంటి సత్తిరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

### విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు సాధించాలి

భూదాన్ పోచంపల్లి : విద్యార్థులు క్రమశిక్షణతో విద్యను అభ్యసించి ఉన్నత లక్ష్యాలను సాధించాలని ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని బాలాజీ ఫంక్షన్ హాల్‌లో శనివారం నిర్వహించిన గౌతమి హైస్కూల్ సిల్వర్ జూబ్లీ వేడుకల్లో ఆయన మాట్లాడారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ రావుల జంగయ్య, ప్రొఫెసర్ జి.రామదాసు, తడక యాదగిరి, సారపు అచ్చయ్య, నాయకులు, విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## పలు కుటుంబాలకు మాజీ ఎమ్మెల్యే సునీత పరామర్శ

మదర్ డెయిరీ డైరెక్టర్ రాంరెడ్డిని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే సునీతామహేందర్‌రెడ్డి

రాజాపేట, అక్టోబర్ 5 : మండలంలోని జాల గ్రామంలో మదర్ డెయిరీ డైరెక్టర్ గొల్లపల్లి రాంరెడ్డి తండ్రి కృష్ణారెడ్డి ఇటీవల మృతి చెందారు. మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీతా మహేందర్‌రెడ్డి శనివారం వారి ఇంటికి వెళ్లి కృష్ణారెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. రాజాపేటలో జడల శేఖర్ గౌడ్, కుర్రారంలో జూకంటి ఐలయ్య కుటుంబాలను పరామర్శించారు. ఆమె వెంట బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు సట్టు తిరుమలేశ్, నాయకులు చింతలపూరి వెంకట్‌రాంరెడ్డి, గుంటి మధుసూదన్‌రెడ్డి, సందిల భాస్కర్‌గౌడ్, బొంగోని ఉప్పలయ్యగౌడ్, జూకంటి బాలస్వామి, కొన్యాల నర్సిరెడ్డి, గజ్జెల రాజు, రాగిర్ బాలయ్యగౌడ్ ఉన్నారు.

## డిజిటల్ కార్డు సర్వేకు ప్రతిఒక్కరూ సహకరించాలి

ఇంటింటి సర్వేను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్ వెంకటేశ్వర్లు

భువనగిరి అర్బన్, అక్టోబర్ 5 : ఫ్యామిలీ డిజిటల్ కార్డు సర్వేకు ప్రతిఒక్కరూ సహకరించాలని మున్సిపల్ చైర్మన్ పోతంశెట్టి వెంకటేశ్వర్లు అన్నారు. పట్టణంలోని అర్బన్ కాలనీ 15వ వార్డులో జరుగుతున్న ఇంటింటి సర్వేను శనివారం ఆయన పరిశీలించారు. డిజిటల్ సర్వేలో భాగంగా కుటుంబ సభ్యుల వివరాల సేకరణకు ఇంటింటికీ మున్సిపల్ అధికారులు వస్తున్నారని, కుటుంబ సభ్యులు అందుబాటులో ఉండాలని అన్నారు. డిజిటల్ కార్డుకు అవసరమయ్యే గుర్తింపు కార్డులు అందజేయాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ పి.రామానుజులరెడ్డి, కౌన్సిలర్ నాజియా, సిబ్బంది పాల్గొన్నారు.

## నూనె గింజల సాగుతో అధిక లాభాలు

● ఏరువాక శాస్త్రవేత్త మమత



చందుపట్ల గ్రామ సామాజిక పటాన్ని పరిశీలిస్తున్న రైతులు

భువనగిరి కలెక్టరేట్, అక్టోబర్ 5 : కూరగాయలతో పాటు నూనె గింజల సాగు చేపడితే అధిక లాభాలు పొందవచ్చని ఏరువాక శాస్త్రవేత్త కె.మమత అన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం, ఏరువాక కేంద్రం, వ్యవసాయ కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో మండలంలోని చందుపట్ల గ్రామంలో యాసంగి వేరుశనగ సాగు, మెళకువలపై రైతులకు శనివారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వేరుశనగను యాసంగిలో సాగు చేస్తే అధిక దిగుబడి పొందవచ్చన్నారు. పచ్చికాయగా సైతం అమ్మవచ్చని తెలిపారు. కోతులు, అడవి పందులు, నెమళ్లు, పిట్టల బెడద నుంచి పంటను కాపాడుకునేందుకు తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. గ్రామంలో ఉన్న వనరులను వివరిస్తూ అధిక దిగుబడికి పాటించవలసిన మెళకువలను వివరించారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం విద్యార్థినులు, రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## 'పన్ను చెల్లింపు వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి'

పంచాయతీ సిబ్బందికి వినతిపత్రం ఇస్తున్న సీపీఎం నాయకులు

బీబీనగర్, అక్టోబర్ 5 : ఇంటి, ఆస్తి పన్నులు చెల్లించిన వారి వివరాలను వెంటనే ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కోమటిరెడ్డి చంద్రారెడ్డి అన్నారు. ఈ మేరకు మండల కేంద